క్లుప్తంగా

అగ్రవర్ణాల పార్టీలను భూస్థాపితం చేయాలి



మాక్లూర్: రానున్న ఎన్నికల్లో అగ్రవర్ణాల రాజకీయ పార్టీల అభ్యర్థులను ఓడించి, పార్టీలను భూస్థాపితం చేయాలని ధర్మ సమాజ్‌పార్టీ ఆర్మూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రేమ్ మహరాజ్ పిలుపునిచ్చారు. మండలంలోని మాందాపూర్ గ్రామంలో శుక్రవారం గడప గడపకు ధర్మ సమాజ్ పార్టీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జనాభాలో 90 శాతం ఎస్సీ, బీసీ, ఎస్టీలు ఉండగా 10 శాతం ఉన్న అగ్రవర్ణాల పార్టీల పెత్తనం ఏమిటని ప్రశ్నించారు. ఇప్పటికైన ప్రజలు మేల్కొనాలని సూచించారు. మండల అధ్యక్షుడు శ్రీనివాస్, రమేష్, శ్రీకాంత్,గంగాధర్, శ్రీహరి, సంపత్, నితిన్‌లు పాల్గొన్నారు.

ఉదయనిధి దిష్టిబొమ్మ దహనం



ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని అంబేద్కర్‌చౌరస్తా వద్ద శుక్రవారం తమిళనాడు మంత్రి ఉదయనిధి స్టాలిన్ దిష్టిబొమ్మను బీజేపీ ఆధ్వర్యంలో దహనం చేశారు. ఈసందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ.. ఎన్నో సంవత్సరాల చరిత్ర కలిగిన హిందూ ధర్మం గురించి స్టాలిన్ అనుచిత వ్యాఖ్యలు చేయడంపై తీవ్రంగా ఖండించారు. నాయకులు ద్యాగ ఉదయ్, పుప్పాల శివరాజ్, పాలేపు రాజు, మందుల బాలు, కలిగోట ప్రశాంత్ పాల్గొన్నారు.

రుణమాఫీ డబ్బులు జమచేయాలి



బోధన్: రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల హామీ మేరకు రూ. లక్ష పంట రుణమాఫీని అర్హులైన రైతులందరి బ్యాంక్ ఖాతాలకు జమా చేయాలని అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గుమ్ముల గంగాధర్ డిమాండ్ చేశారు. ఈమేరకు శుక్రవారం ఆయన పట్టణంలోని ఆర్డీవో రాజాగౌడ్‌ను కలిసి వినతిపత్రం అందించారు. నాయకులు పుట్టి నడ్పి నాగన్న, సుల్తాన్ సాయిలు, గోపాల్, సాయన్న, హన్మాండ్లు పాల్గొన్నారు.

పద్మశాలీలు రాజకీయంగా ఎదగాలి



నవీపేట: పద్మశాలీలు రాజకీయంగా ఎదగాలని పద్మశాలి సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి పులగం హన్మాండ్లు పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని మార్కండేయ మందిర ఆవరణలో శుక్రవారం నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారం నిర్వహించారు. కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. రాబోయే ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ప్రజాప్రతినిధులుగా గెలిచేందుకు ఐకమత్యాన్ని చాటాలని సూచించారు. నాయకులు గంగాచరణ్, లక్ష్మీనారాయణ, నర్సయ్య, శివరామ్, మ్యాకలక్ష్మన్, నవీన్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ టీచర్ల వేతనాలు పెంచాలి

నవీపేట: అంగన్‌వాడీ టీచర్ల వేతనాలను పెంచాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు యూనియన్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ టీచర్లు శుక్రవారం డీటీకి వినతిపత్రం సమర్పించారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రమేష్‌బాబు మాట్లాడుతూ.. అంగన్‌వాడీ టీచర్ల డిమాండ్లను వెంటనే నెరవేర్చాలన్నారు. లేదంటే సమ్మె చేస్తామని అధికారులు నోటీసులు ఇచ్చామని పేర్కొన్నారు. నాయకులు నాయక్‌వాడీ శ్రీనివాస్, శివరాజవ్వ, సుజాత, ఉమారాణి, మాధవి పాల్గొన్నారు.

లబ్ధిదారులకు గొర్రెల పంపిణీ

డొంకేశ్వర్(ఆర్మూర్): మండలంలోని నికాల్‌పూర్ గ్రామంలో శుక్రవారం పలువురు లబ్ధిదారులకు రెండో విడత గొర్రెల పంపిణీలో భాగంగా శుక్రవారం గొర్రెల యూనిట్లు పంపిణీ చేశారు. మండల పశువైద్య అధికారి హన్మంతురెడ్డి, ఉప సర్పంచ్ శ్రీనివాస్, పశువైద్య సిబ్బంది స్వప్న ఉన్నారు.

ముగిసిన శిక్షణ తరగతులు

పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మండలం చేపూర్ క్షత్రియ ఇంజినీరింగ్ కళాశాలలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న సీబీఎస్ఈ శిక్షణ తరగతులు శుక్రవారం ముగిశాయి. ఈ సందర్భంగా సీబీఎస్ఈ రీసోర్స్ పర్సన్స్ అమీర్ ఖాన్, యేలేశ్వర్‌రావు మాట్లాడుతూ అధ్యాపకులు విద్యార్థుల్లో నిబిడీకృతమైన ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాలని సూచించారు. క్షత్రియ విద్యా సంస్థల చైర్మన్ అల్జాపూర్ శ్రీనివాస్, దేవేందర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

వంతెన నిర్మాణమెప్పుడో?

- టెండరు పూర్తయినా మొదలవని పనులు
- తొండాకూర్–కుద్వాన్‌పూర్ రోడ్డును చీల్చుతున్న వాగు
- నిలిచిన రాకపోకలు
- మార్గాన్ని మూసివేసినా లెక్కచేయని కొందరు పాదచారులు



తెగిపోయిన తొండాకూర్-కుద్వాన్‌పూర్ బీటీ రోడ్డు

డొంకేశ్వర్(ఆర్మూర్): డొంకేశ్వర్ మండలంలో తొండాకూర్ నుంచి కుద్వాన్‌పూర్ వరకు వేసిన బీటీ బైపాస్ రోడ్డు ప్రమాదకరంగా మారింది. చుట్టు పక్కల గ్రామాలకు వెళ్లడానికి దూరాన్ని తగ్గించే ఈ రోడ్డు తొండాకూర్ శివారు వద్ద కోతకు గురైంది. వర్షాలు కురిసినప్పుడల్లా ఎగువ ప్రాంతం నుంచి వాగు ప్రవహిస్తోంది. దీంతో రోడ్డే కాకుండా ఈ ప్రాంత రైతుల పొలాలు కూడా కొట్టుకుపోతున్నాయి. ఇటీవల నందిపేట్‌కు చెందిన ఓ యువకుడు ఇక్కడే ప్రమాదవశాత్తు పడి మరణించాడు. పైపులు వేసి వాటిపై మట్టితో రోడ్డు వేసినా ఇప్పటికి రెండు సార్లు కొట్టుకుపోయింది.

వాహనదారులు ప్రయాణాలు సాగించకుండా ఆర్అండ్‌బీ అధికారులు రోడ్డును మూసివేశారు. అయినప్పటికీ సాహసం చేసి పాదచారులు ఎవరి మాటలు లెక్కచేయకుండా పారుతున్న వాగును దాటుతున్నారు. ప్రమాదాలు జరుగకుండా అధికారులు కఠిన చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

రూ.2.20కోట్లు.. 20మీటర్ల బ్రిడ్జి..

రోడ్డుకు మరమ్మతులు చేసినప్పటికీ వాగు ఉధృతికి కొట్టుకుపోతుంది. రాకపోకలు చేయలేని విధంగా ఇరవై అడుగుల వెడల్పు వరకు రోడ్డుపై భారీ గుంత ఏర్పడింది. ఇక్కడ వంతెనను నిర్మిస్తేనే ఈ సమస్యకు పరిష్కారం లభిస్తుందని అధికారులు భావించారు. ప్రభుత్వం నుంచి రూ.2.20కోట్లు మంజూరు కూడా తీసుకున్నారు. టెండరును హైదరాబాద్‌కు చెందిన వ్యక్తి దక్కించుకున్నారు. ఐతే టెండరు పూర్తయి రోజులు గడుస్తున్నా ఇంత వరకు పనులు ప్రారంభం కాలేదు. మొత్తం 20 మీటర్ల మేర బ్రిడ్జిని నిర్మించాల్సి ఉంది. ఈ పనులను ఆర్అండ్‌బీ శాఖ చూస్తోంది. వంతెన పనులను త్వరగా ప్రారంభించి వచ్చే వర్షాకాలం నాటికి పూర్తి చేస్తే బాగుటుందని ప్రజలు కోరుతున్నారు.

బ్రిడ్జి కట్టేదాకా ఇబ్బందే



రోడ్డు కోతకు గురి కాకుండా ఎన్నిసార్లు మట్టి పోసినా ఉపయోగం ఉండడం లేదు. బ్రిడ్జి మంజూరైనా పనులు ఇంకా మొదలు కాలేదు. గ్రామాలకు రాకపోకలు ఆగిపోయాయి. బ్రిడ్జిని కట్టేదాకా ప్రయాణికులకు, రైతుల పంట పొలాలకు ఇబ్బందే. – జంగం రాజేశ్వర్, రైతు, తొండాకూర్

త్వరలో పనులు ప్రారంభిస్తాం

బ్రిడ్జి నిర్మించడానికి టెండరు, అగ్రిమెంట్ ప్రక్రియ పూర్తయింది. కాంట్రాక్టర్ ద్వారా త్వరలోనే పనులు ప్రారంభించడానికి చర్యలు చేపడుతాం. అప్పటి వరకు ప్రజలు ఈ రోడ్డు మీదుగా రాకుండా ఉంటేనే మంచిది. – రఘు, ఏఈ, ఆర్అండ్‌బీ

పనులను వెంటనే పూర్తిచేయాలి



ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ పనులను పరిశీలిస్తున్న మంత్రి ప్రశాంత్‌రెడ్డి

బాల్కొండ: మండలకేంద్రంలో నిర్మిస్తున్న ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ నిర్మాణ పనులను వెంటనే పూర్తి చేయాలని రాష్ట్ర రోడ్డు, భవనాల శాఖ మంత్రి ప్రశాంత్‌రెడ్డి ఆదేశించారు. నిర్మాణ పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. దేశంలో ఎక్కడ లేనివిధంగా పరిపాలన సౌలభ్యం కోసం కేసీఆర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాలను ఏర్పాటు చేశారన్నారు. పనులు ప్రస్తుతం తుదిదశలో ఉన్నాయన్నారు. నాయకులు బద్దం ప్రవీణ్‌రెడ్డి, ముస్కు భూమేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరిక

వేల్పూర్: బాల్కొండ నియోజకవర్గంలోని ఏర్గట్ల మండలం తడపాకల్ గ్రామానికి చెందిన బీజేపీ, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు శుక్రవారం బీఆర్ఎస్‌లో చేరారు. వేల్పూర్‌లో మంత్రి ప్రశాంత్‌రెడ్డి వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

ఎమ్మెల్యే టికెట్ల కోసం దరఖాస్తు



హైదరాబాద్‌లో పార్టీ ఇన్‌చార్జిలకు దరఖాస్తును అందజేస్తున్న మారంపల్లి గంగాధర్



దరఖాస్తును సమర్పిస్తున్న తిర్మన్‌పల్లి సుభాష్

డొంకేశ్వర్(ఆర్మూర్): బీజేపీ తరపున ఎమ్మెల్యేగా పోటీ చేయడానికి అవకాశం కల్పించాలంటూ బీజేపీకి చెందిన ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు మారంపల్లి గంగాధర్ దరఖాస్తు చేసుకున్నారు. ఈ మేరకు శుక్రవారం హైదరాబాద్ నాంపల్లి బీజేపీ కార్యాలయంలో దరఖాస్తును అందజేశారు. నాయకులు సురేందర్ తదితరులు ఉన్నారు.

పెర్కిట్(ఆర్మూర్): వచ్చే ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిగా పోటీ చేయడానికి అవకాశం ఇవ్వాలని నిజామాబాద్ జిల్లా ఆలూర్ మండల కేంద్రానికి చెందిన తిర్మన్‌పల్లి సుభాష్ శుక్రవారం దరఖాస్తు చేసుకున్నారు. హైదరబాద్‌లోని రాష్ట్ర పార్టీ కార్యాలయంలో ఇన్‌చార్జిలకు ఆయన దరఖాస్తును సమర్పించారు. నాయకులు కొత్తూర్ గిరీష్, మర్కంటి గంగాధర్, మల్లయ్య, హరీష్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ విజయానికి కృషి చేయాలి



చిన్నారెడ్డికి నియామకపత్రం అందజేస్తున్న మార చంద్రమోహన్

పెర్కిట్(ఆర్మూర్): రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయానికి కృషి చేయాలని టీపీసీసీ మాజీ అధికార ప్రతినిధి మార చంద్రమోహన్ మండల పార్టీ కార్యవర్గానికి సూచించారు. ఆర్మూర్ మండలం అంకాపూర్ గ్రామంలో శుక్రవారం ఆయన నూతన కార్యవర్గానికి నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆర్మూర్ నియోజకవర్గం నుంచి ఎవరు పోటీ చేసిన వారిని భారీ మెజార్టీతో గెలిపించడానికి కృషి చేయాలన్నారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడిగా సురకంటి చిన్నారెడ్డి, ఉపాధ్యక్షుడిగా ఉమ్మెడ లింగన్న, మంథని చిన్నారెడ్డి, నర్సారెడ్డి, అరుణ్, ప్రధాన కార్యదర్శులుగా ప్రవీణ్, రవి, ముత్తెన్న, రాజారెడ్డి, కార్యదర్శిగా శ్రీనివాస్, కోశాధికారి అమృత్ రావు, సంయుక్త కార్యదర్శులుగా శ్రీనివాస్, అనిల్ ఎన్నికయ్యారు. నాయకులు ప్రమోద్, జీవన్ పాల్గొన్నారు.

అన్ని వర్గాల అభివృద్ధికి కృషి



కమ్యూనిటీ హాల్‌ను ప్రారంభిస్తున్న స్పీకర్

రుద్రూర్: నియోజకవర్గంలో అన్ని వర్గాల అభివృద్ధికి కృషి చేస్తున్నామని, అన్ని మతాల ఆలయాల అభివృద్ధికి రూ.150కోట్ల నిధులు మంజూరు చేశామని స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి వెల్లడించారు. మండల కేంద్రంలో శుక్రవారం ఆయన హనుమాన్ మందిర నిర్మాణానికి భూమిపూజ చేశారు. అలాగే కమ్యూనిటీ హాల్‌ను స్పీకర్ ప్రారంభించారు. నియోజకవర్గంలో హిందూ దేవాలయాలు, మసీదులు, దర్గాలు చర్చిల నిర్మాణానికి అధిక ప్రాధాన్యత ఇస్తూ నిధులు కేటాయిస్తున్నామన్నారు. బాన్సువాడ నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్‌చార్జి సురేందర్‌రెడ్డి, ఎంపీపీ సునీత, జెడ్పీటీసీ శంకర్ పటేల్, వైస్ ఎంపీపీ గంగాధర్ పటేల్, సర్పంచ్ వర్ని శంకర్ పాల్గొన్నారు.

బోగస్ ఓటర్ల నమోదు ప్రక్రియను నిలిపివేయాలి



బోధన్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న బీజేపీ నేతలు



మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

బోధన్: నియోజకవర్గంలో బోగస్ కొత్త ఓటర్ల నమోదు ప్రక్రియను నిలువరించాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మేడపాటి ప్రకాష్‌రెడ్డి, వడ్డి మోహన్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈమేరకు వారు పార్టీ శ్రేణులతో కలిసి శుక్రవారం పట్టణంలో ర్యాలీ నిర్వహించి, ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. అనంతరం ఆర్డీవో రాజాగౌడ్‌కు పార్టీ నాయకులు వినతిపత్రం అందించారు. ఈసందర్భంగా పార్టీ నాయకులు మాట్లాడుతూ.. పట్టణంలోని ముస్లింలు ఉండే పోలింగ్‌బూత్‌లలో బోగస్ కొత్త ఓటర్ల ఎన్‌రోల్‌మెంట్ జరుగుతోందని, ఇలాంటి దరఖాస్తులను అధికారులు పరిశీలించి తిరస్కరించాలన్నారు. సమగ్ర విచారణ జరిపించి, చర్యలు తీసుకోవాలన్నారు. నాయకులు అడ్లూరి శ్రీనివాస్, సుధాకర్‌చారి, బాల్‌రాజ్ పాల్గొన్నారు.

బోగస్ ఓటర్ల వ్యవహారంతో సంబంధం లేదు...

బోగస్ ఓటర్ల ఎన్‌రోల్‌మెంట్ వ్యవహారం జరుగుతోందని, ఎమ్మెల్యే షకీల్, బీఆర్ఎస్ నాయకులకు సంబంధం ఉన్నట్లు కాంగ్రెస్, బీజేపీ నాయకులు చేస్తున్న ఆరోపణల్లో నిజంలేదని ఏఎంసీ చైర్మన్ వీఆర్‌దేశాయ్, పార్టీ సీనియర్ నాయకులు బుద్దె రాజేశ్వర్, నక్క లింగారెడ్డి తెలిపారు. శుక్రవారం పట్టణంలో వారు విలేకరులతో మాట్లాడారు. బోగస్ ఓటర్ల వ్యవహారంతో ఎమ్మెల్యే, పార్టీ నాయకులకు ఎలాంటి సంబంధం లేదని తెలిపారు.

అధికారులు చర్యలు చేపట్టాలి..

బోధన్‌టౌన్(బోధన్): బోగస్ ఓట్లపై ఉన్నత అధికారులు ప్రత్యేక దృష్టిసారించి తగు చర్యలు చేపట్టాలని టీపీసీసీ కోశాధికారి, మాజీ మంత్రి సుదర్శన్ రెడ్డి డిమాండ్ చేశారు. బోధన్‌లోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్టీ పటిష్టత కోసం బోగస్ ఓట్ల నమోదుపై నాయకులు, కార్యకర్తలు ప్రత్యేక దృష్టిసారించాలని, అధికారులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

బీఆర్ఎస్ మాజీ కౌన్సిలర్ చేరిక

బీఆర్ఎస్ పార్టీకి చెందిన మాజీ కౌన్సిలర్ షర్ఫోద్దిన్ ఆధ్వర్యంలో ఆయన అనుచరులతో పాటు, వివిధ వార్డులకు చెందిన వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు, యువకులు మాజీ మంత్రి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న ఎంపీడీవో బషీరుద్దీన్

వర్ని: వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధులపై ఆరోగ్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని వర్ని ఎంపీడీవో బషీరుద్దీన్ సూచించారు. మండలకేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం ఆశ కార్యకర్తలు, ఏఎన్ఎంలతో ఆయన సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో నీరు నిల్వ ఉండకుండా పరిసరాలు శుభ్రంగా ఉండేవిధంగా ప్రజలను, పంచాయతీ అధికారులను చైతన్య పరచాలని సూచించారు. వారానికి ఒకసారి నీటి ట్యాంకులను క్లోరినేషన్ చేసేవిధంగా చర్యలు తీసుకోవాలని, ఆహార అలవాట్లపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఎంపీవో చందర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

కాచి, చల్లార్చిన నీటిని తాగాలి..

వర్ని: సీజనల్ వ్యాధులు రాకుండా ఉండేందుకు ప్రజలు కాచి చల్లార్చిన నీటిని తాగాలని మోస్రా మెడికల్ ఆఫీసర్ విజయ్ కుమార్ సూచించారు. మండల కేంద్రంలో పంచాయతీ కార్యదర్శులు, ఆశ కార్యకర్తలతో ఆయన ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. పరిసరాల శుభ్రత, నీటి క్లోరినేషన్‌పై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఎంపీవో రఫీ, జీపీ కార్యదర్శులు పాల్గొన్నారు.

నేత్రదానానికి ముందుకు రావాలి

మాక్లూర్: నేత్రదానం చేయడానికి ప్రతి ఒక్కరు ముందుకు రావాలని మండల వైద్యాధికారి ప్రవీణ్ రెడ్డి పిలుపునిచ్చారు. మండలకేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో శుక్రవారం జిల్లా ఆప్తాల్మిక్ అధికారి లక్ష్మినారాయణ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మరణించిన తరువాత కొన్ని అవయవాలు ఉపయోగ పడుతున్నందున అవయవ దానంకు ముందుకు రావాలన్నారు. అనంతరం డెంగీ వ్యాధి లక్షణాలను వివరించి, కొందరు విద్యార్థుల రక్త నమూనాలను సేకరించి, పరీక్షల నిమిత్తం ల్యాబ్‌కు పంపించారు. వైద్యులు ఆనంద్, రాజ్యలక్ష్మి, కేజీబీవీ ఇంచార్జీ అధికారి సవితలు పాల్గొన్నారు.

వర్గీకరణ బిల్లుకు సహకరించాలి

నవీపేట: పార్లమెంట్ సమావేశాలలో ఎస్సీ వర్గీకరణ బిల్లుకు చట్టబద్ధత కల్పించేందుకు సహకరించాలని దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావ్‌కు ఎమ్మార్పీఎస్ నాయకులు శుక్రవారం వినతిపత్రం సమర్పించారు. నాయకులు మురళీకృష్ణ, శివకుమార్, భూమయ్య, గంగాధర్, రమేష్ జీన్నారు.

కఠిన చర్యలు తీసుకోవాలి

బోధన్‌టౌన్: కార్తికేయ లింగేశ్వరా ఆలయంలో గోవు తల నరికి వేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, 100స్తంభాల గుడి వద్ద పోలీస్ పికెట్ ఏర్పాటు చేయాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు శుక్రవారం వారు పట్టణ సీఐ ప్రేమ్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు.

ఆధ్యాత్మికం..

■ ఘనంగా బారెడు పోచమ్మ పండుగ



వర్ని: చందూరు మండల కేంద్రంలో బారెడు పోచమ్మ పండుగను ప్రజలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా మహిళలు బోనాలను ఎత్తుకొని ఊరేగింపుగా వచ్చి, అమ్మవారికి సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం అమ్మవారి జెండాను ఆవిష్కరించారు. ఎంపీపీ లావణ్య రాంరెడ్డి, వైస్ ఎంపీపీ దశగౌడ్, సర్పంచ్ కర్లం సాయిరెడ్డి, అశోక్ పాల్గొన్నారు.

■ కన్యకా పరమేశ్వరి విగ్రహం ఊరేగింపు



బోధన్‌టౌన్(బోధన్): పట్టణంలో శుక్రవారం ఆర్యవైశ్యుల కులదైవం వాసవి కన్యకాపరమేశ్వరి విగ్రహన్ని శుక్రవారం ఘనంగా ఊరేగించారు. నేడు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని, ఆదివారం విగ్రహ ప్రతిష్ఠాపన చేయనున్నట్లు ఆలయకమిటీ ప్రతినిధులు తెలిపారు. అలాగే భక్తులకు అన్నదానం ఏర్పాటుచేసినట్లు తెలిపారు.

పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం





మోతెలో మాట్లాడుతున్న రసూల్‌బీన్.. సుర్బిర్యాల్ గ్రామంలో మాట్లాడుతున్న సీడీపీవో భార్గవి

వేల్పూర్/పెర్కిట్/వర్ని/మాక్లూర్: పోషకాహారం తీసుకోవడంతో గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లలు సంపూర్ణ ఆరోగ్యం పొందుతారని జిల్లా సంక్షేమ అధికారి రసూల్‌బీన్ పేర్కొన్నారు. ఆర్మూర్, బాల్కొండ, బోధన్ నియోజకవర్గాల్లోని పలు మండలాల్లో శుక్రవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషకాహార వారోత్సవాలు నిర్వహించారు. వేల్పూర్ మండలం మోతె గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో రసూల్‌బీన్ పాల్గొని, మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే పోషకాహారాన్ని తప్పకుండా తీసుకోవాలన్నారు. ఆర్మూర్ మండలం సుర్బిర్యాల్‌లో సీడీపీవో భార్గవి, మాక్లూర్ మండలం సింగంపల్లితండాలో సూపర్‌వైజర్ సునీత, వర్నిలో అంగన్‌వాడీ కార్యకర్తలు కార్యక్రమాన్ని నిర్వహించారు. గర్భిణులకు సామూహిక సీమంతం, చిన్న పిల్లలకు అన్నప్రాసన కార్యక్రమాలు నిర్వహించారు.

బీజేపీ నాయకుల నిరసన



భీమ్‌గల్: తమ పార్టీ నేతల ఫ్లెక్సీలను మున్సిపల్ అధికారులు తొలగించారంటూ బీజేపీ నాయకులు శుక్రవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. అనంతరం వారు మాట్లాడుతూ.. మున్సిపల్ కార్యాలయం ఎప్పుడు చూసిన ఖాళీ కుర్చీలతో దర్శనం ఇస్తుందని అన్నారు. మున్సిపల్ అధికారులు కార్యాలయంలో కంటే బీఆర్ఎస్ ప్రజాప్రతినిధుల ఇళ్లలో పని చేస్తున్నారని ఆరోపించారు. నాయకులు ములిగే మహిపాల్, నర్సయ్య, కార్యకర్తలు పాల్గొన్నారు.

సినిమాలు తెలుగు/హిందీ/ఇంగ్లీష్



పీవీఆర్ మల్టీప్లెక్స్(ఆర్మూర్)

స్క్రీన్-1 –	జవాన్(తెలుగు) – 09.50, 10.10 జవాన్(హిందీ)- 4.00
స్క్రీన్-2 –	మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి -10.00, 1.10, 4.20, 7.30, 10.40
స్క్రీన్-3 –	ఖుషి – 11.15, 2.40, 6.05, 9.30
స్క్రీన్-4 –	జైలర్(తెలుగు)- 11.00, 2.35, జవాన్(హిందీ)- 6.10, 9.45

సంక్షిప్తం

ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు



పెర్కిట్/వేల్పూర్: పెర్కిట్‌లో గల కాంతి హైస్కూల్‌లో, వేల్పూర్ మండలం మోతె విజ్ఞాన్‌స్కూలులో శుక్రవారం కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా పాఠశాల విద్యార్థులు శ్రీకృష్ణుడు, రాధ, గోపికల వేషధారణలో కనువిందు చేశారు. అలాగే విద్యార్థుల కోలాటం, ఉట్టి కొట్టే కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ కాంతి గంగా రెడ్డి, డైరెక్టర్లు హిమారాణి, శశాంక్, నిఖిత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పశువులకు టీకాలు

మాక్లూర్: మండలంలోని ముల్లంగి (బి) గ్రామంలో శుక్రవారం మండల పశువైద్యులు కిరణ్‌దేశ్‌పాండే, ఉమా సహేర్ ఆధ్వర్యంలో పశు వైద్యసిబ్బంది పశువులకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు వేశారు. సర్పంచ్ పావణి శ్యాంరావు, పశు వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని విద్యాహైస్కూల్‌లో శుక్రవారం రోటరీ క్లబ్ ఆఫ్ ఆర్మూర్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయుల దినోత్సవం, అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవం నిర్వహించారు. వేడుకల్లో తెయూ రిజిస్ట్రార్ యాదగిరి పాల్గొని, మాట్లాడారు. ఉత్తమ ఉపాధ్యాయులను సత్కరించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని సోషల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాల విద్యార్థి శ్రావణ్ రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యాడు. ఈసందర్భంగా శుక్రవారంల ప్రిన్సిపాల్ దుర్గారెడ్డి ఆయనను అభినందించారు.

ఆసరా పింఛన్ అందించాలి

బోధన్: రిటైర్డ్ అయిన ఆర్టీసీ కార్మికులకు ప్రభుత్వం ఆసరా పింఛన్ అందించాలని వారు ప్రభుత్వాన్ని కోరారు.ఈ మేరకు పట్టణంలో శుక్రవారం వారు సమావేశం నిర్వహించి, మాట్లాడారు. సంస్థను ప్రభుత్వంలో విలీనం చేసినందుకు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

ఆలయానికి రూ.లక్ష విరాళం

బోధన్‌టౌన్: పట్టణంలోని పురాతన మారుతి మందిరం అభివృద్ధి కోసం ఎమ్మెల్యే షకీల్ తరపున రూ. లక్ష విరాళాన్ని శుక్రవారం బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు రవీందర్ యాదవ్ అందజేశారు. వీడీసీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

నియామకం..

బాల్కొండ: ముప్కాల్ మండల కాంగ్రెస్ బీసీ సెల్ అధ్యక్షుడిగా రెంజర్ల గ్రామానికి చెందిన ఆకుల రమేశ్ నియమితులయ్యారు. ఈ మేరకు శుక్రవారం డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు నరేందర్‌గౌడ్, మండల అధ్యక్షుడు ముత్యంరెడ్డి నియామకపత్రం అందించారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచాలి

ఆర్మూర్‌టౌన్: సీజనల్ వ్యాధులు రాకుండా పరిసరాలను శుభ్రంగా ఉంచాలని కౌన్సిలర్ ఖాందేష్ సంగీత అన్నారు. పట్టణంలోని రెండోవార్డులో శుక్రవారం ఫ్రైడే డ్రైడే కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా సంగీత ఇంటింటికీ తిరిగి ప్రజలకు పరిసరాల శుభ్రతపై అవగాహన కల్పించారు.